సాక్షి మెదక్

ఆదివారం । 21 । జనవరి । 2024



నిధుల్లేవ్.. నీళ్లు లేవ్!

జిల్లాలో వేలాది ఎకరాలకు సాగు నీరు అందించే కాళేశ్వరం కాల్వ పనులకు గ్రహణం వీడడం లేదు. వివరాలు 10లో ▸



ఫారెస్ట్ భూమి కబ్జా చేస్తే...

ఎవరైనా అడవిని కబ్జా చేసేందుకు యత్నిస్తే చర్యలు తీసుకొని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ అన్నారు. వివరాలు 10లో ▸



ఓటరు నమోదుపై స్పెషల్ డ్రైవ్

జిల్లాలో రెండు రోజులపాటు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

మార్పులు, చేర్పులకు చాన్స్

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



ప్రత్యేక క్యాంప్‌లో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

మనోహరాబాద్(తూప్రాన్): ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఓటు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందజేశారు. జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల దరఖాస్తులెన్ని వచ్చాయనే వివరాలు తెలుసుకున్నారు. పాత ఓటరు కార్డులోని తప్పులను సవరించుకొనే అవకాశం ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కౌశిక్, గిర్దావర్ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత

- ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ సూచన



మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

హవేళిఘణాపూర్(మెదక్): పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి(డీఈఓ) రాధాకిషన్ అన్నారు. శనివారం మెదక్ మండలం మక్తభూపతిపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో ఎస్ఎంసీ చైర్మన్ ఎన్నికలు ఈ నెల 29న నిర్వహించనున్నామని, ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. విద్యార్థులు పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించి సత్ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఈపోస్‌తోనే ఎరువుల విక్రయాలు

- జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్



డీలర్లతో మాట్లాడుతున్న గోవింద్

పెద్దశంకరంపేట(మెదక్): ఈపోస్ మిషన్ ద్వారానే డీలర్లు ఎరువులను విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ సూచించారు. శనివారం స్థానిక రైతు వేదికలో పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్ మండలాలకు చెందిన డీలర్లు, ఏఈఓలతో కలిసి ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఎరువులు కొనుగోలు చేస్తే రశీదులను తీసుకోవాలన్నారు. డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యాసంగి నిల్వలు అందుబాటులో ఉండాలన్నారు. స్టాక్ వివరాలు, లైసెన్స్ ప్రదర్శన దుకాణంలో కనపడేలా ఉండాలన్నారు. ఏఈఓలు గ్రామాలవారీగా పంటల వివరాలను నమోదు చేయాలన్నారు. అల్లాదుర్గం ఇన్‌చార్జి ఏడీఏ రామ్‌ప్రసాద్, ఏఓలు రాజేశ్‌కుమార్ పాల్గొన్నారు.

తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ నియామకం



శ్యామ్‌రావుకు నియామక పత్రం అందజేస్తున్న రవికుమార్

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్‌గా చిన్నశంకరంపేట మండలం అంబాజీపేటకు చెందిన పాస్టర్ శ్యామ్‌రావు నియమితులయ్యారు. శనివారం మండలంలోని అంబాజీపేటలో జరిగిన క్రిస్టియన్ జేఏసీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్యామ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో క్రిస్టియన్ జేఏసీ నిర్వర్తించిన పాత్రను తెలుసుకొని సీఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సాహిస్తున్నారన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రత్నరాజు, సారయ్య, బీఏ పాల్, థామస్, సాగర్, సాల్మన్‌రాజ్ పాల్గొన్నారు.

అక్రమ ఇటుక బట్టీలు

అక్రమ ఇటుక బట్టీలను కొందరు ఏర్పాటు చేసుకొని వ్యవసాయానికిచ్చే ఉచిత విద్యుత్ వాడుతున్నారు. ప్రభుత్వ స్థలాలు, చెరువు, కుంటల్లో మట్టి తవ్వుతున్నారు. కలపను సైతం యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. వాటికి ఎలాంటి అనుమతులూ లేవు. సంబంధిత అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో వారు అడ్డూఅదుపూ లేకుండా కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు.



మెదక్ పట్టణానికి సమీపంలో ఉన్న ఇటుక బట్టీ

- జిల్లాలో పుట్టుకొచ్చినవి 600లకు పైనే..
- యథేచ్ఛగా ఉచిత విద్యుత్ వాడకం
- చెరువుల్లో మట్టి తవ్వకాలు, కలప సైతం తరలింపు
- నిబంధనలు ఉల్లంఘిస్తున్న అక్రమార్కులు



మెదక్–మక్తభూపతిపూర్ రోడ్డు పక్కన ఉన్న బట్టీ

మెదక్: జిల్లావ్యాప్తంగా 600లకు పైగా అక్రమ బట్టీలు ఉన్నాయి. మెదక్, హవేళిఘనాపూర్, చిన్నశంకరంపేట, రామాయంపేట, చేగుంట, నిజాంపేట, పాపన్నపేట, టేక్మాల్, పెద్దశంకరంపేట, కొల్చారం, అల్లాదుర్గం, తదితర మండలాల్లో దందా జోరుగా సాగుతుంది. మెదక్–చేగుంట ప్రధాన రహదారి పక్కన పదుల సంఖ్యలో ఏర్పాటు చేశారు. మెదక్ పక్కన పిల్లికొటాల్ సమీపంలో, చిన్నశంకరంపేట మండలం అంబాజీపేట, శంకరంపేట మండల కేంద్రాన్ని ఆనుకుని రోడ్డు పక్కన, మెదక్–రామాయంపేట మధ్యలో కూడా ఉన్నాయి. ఇక మెదక్–బొడ్మట్‌పల్లి ప్రధాన రహదారిని ఆనుకుని పదుల సంఖ్యలో ఏర్పాటు చేశారు. అక్రమంగా మట్టి తరలింపు, కలప రవాణా, ఉచిత విద్యుత్ వాడకం యథేచ్ఛగా సాగుతుంది.

ఇవేమి పట్టవు..

బట్టీల నిర్వహణ కోసం వ్యవసాయానికి ప్రభుత్వం ఇచ్చే ఉచిత విద్యుత్‌ను అక్రమంగా వాడుతున్నారు. బోరుబావుల నీటిని వాడాలంటే ఎన్ని నెలలపాటు వినియోగించుకుంటారో ట్రాన్స్‌కో అధికారులతో చెప్పి డీడీ రూపంలో రూ. 10 వేలు చెల్లించి మీటర్ తీసుకోవాలి. ఇటుకలను కాల్చేందుకు అవసరమైన కలప కోసం, తయారీకి వాడే మట్టికి కూడా ఫారెస్టు, రెవెన్యూ అధికారుల అనుమతి తప్పనిసరి. అవసరం అనుకుంటే చలాన్‌లు చెల్లించాలి. ఒక వేళ ఇవన్ని పూర్తయిన తర్వాత జనసంచారం లేని ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలి. లేకుంటే దుమ్ము, ధూళి వల్ల ప్రజలు ఇబ్బందులు పడతారు.

బాలకార్మికులు సైతం

ముఖ్యంగా బట్టీల్లో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకొచ్చి పనులు చేయిస్తున్నారు. వారి పిల్లలు కూడా ఇదే పని చేస్తున్నారు. చదువులకు దూరమై బంగారు భవిష్యత్‌ను నిర్వాహకులు బుగ్గిపాలు చేస్తున్నారు. ఎన్నో నిబంధనలున్నా పాటించకుండా విచ్చలవిడిగా నడుపుతున్నారు.

నిర్వాహకులపై కేసులు పెడతాం

ఇటుక బట్టీల నిర్వాహకులు ఉచిత విద్యుత్‌ను వాడితే డీడీలు చెల్లించి మీటర్ తీసుకోవాలి. జిల్లావ్యాప్తంగా 600లకు పైగా కొనసాగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఎనిమిదింటికే అనుమతులు ఉన్నాయి. విజిలెన్స్ దాడులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 16 కేసులు నమోదు చేశారు. నిర్వాహకులపై కేసులు పెడతాం.

– మోహన్‌బాబు, ట్రాన్స్‌కో ఏడీ మెదక్

125% సీఎంఆర్ రికవరీ చేస్తాం

ఆర్‌ఆర్‌యాక్ట్ కింద స్థిర, చర ఆస్తుల జప్తు, క్రిమినల్ కేసులు

- రైస్ మిల్లర్లకు కలెక్టర్ రాజర్షిషా హెచ్చరిక



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: సీఎంఆర్ లక్ష్యం నిర్ణీత గడువు లోపు పూర్తి చేయకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ రాజర్షిషా రైస్ మిల్లర్లను హెచ్చరించారు. ఆర్ఆర్ యాక్ట్ కింద 125 శాతం రికవరీ చేస్తామన్నారు. శనివారం కలెక్టరేట్‌లో రైస్ మిల్లు యజమానులతో కలిసి ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం ఈనెలాఖరు వరకు గడువు ఇచ్చిందన్నారు. ఆలోపు బియ్యం తిరిగి ఇవ్వని సదరు యజమానులపై ఆర్ఆర్ యాక్ట్ కింద స్థిర, చర ఆస్తులను జప్తు చేసి క్రిమినల్ కేసులు పెడతామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి సామర్థ్యానికి అనుగుణంగా కస్టమ్ మిల్లింగ్ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలుంటే జిల్లా యంత్రాంగం తరఫున పరిష్కరిస్తామని భరోసానిచ్చారు.

ఒక్క ఓటరు మిగలకూడదు

ఒక్క ఓటరు మిగిలిపోకుండా కొత్త ఓటర్లను నమోదు చేయించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. శనివారం మెదక్ జిల్లా అటవీ శాఖ కార్యాలయం ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఫారం 7ను జనరేషన్ ఎలా చేస్తున్నారని బీఎల్ఓను అడిగి తెలుసుకున్నారు. వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రత్యేక శిబిరాల ప్రక్రియ పూర్తయితే తర్వాత బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు ఇంటింటా సర్వే చేపట్టాలన్నారు.

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఫలితాలు విడుదల

జిల్లాస్థాయి వైజ్ఞానిక, గణిత, పర్యావరణ ప్రదర్శన ఫలితాలను కలెక్టర్ శనివారం విడుదల చేశారు. ఐదు అంశాల్లో సీనియర్, జూనియర్ విభాగాల కింద ప్రతి అంశంలో ముగ్గురిని ఎంపిక చేశారు. మొదటి స్థానం పొందిన విద్యార్థులు వర్చువల్ పద్ధతిలో జరిగే రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించారు. కాగా, ఈనెల 18, 19వ తేదీల్లో జిల్లాస్థాయి వైజ్ఞానిక, గణిత, పర్యావరణ ప్రదర్శనను వర్చువల్ పద్ధతిలో నిర్వహిస్తే 181 ఎగ్జిబిట్స్ ఆన్‌లైన్‌లో నమోదు కావడం తెలిసిందే. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ హరికృష్ణ , డీసీఎస్ఓ బ్రహ్మారావు , రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, రైస్ మిల్లర్లు, డీఈఓ రాధా కిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మెదక్, నర్సాపూర్ ఆర్డీఓలు రాజేశ్వర్, అధికారులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు కావాలి

కొల్చారం(నర్సాపూర్): 18 ఏళ్లు నిండితే ఓటరు జాబితాలో పేరును నమోదు చేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శనివారం మండలంలోని అప్పాజీపల్లిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లోని 579 పోలింగ్ స్టేషన్‌లలో శని ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు.

ప్రమాద రహిత ప్రయాణానికి ప్రాధాన్యం



వాహనాలకు స్టిక్కర్లు వేస్తున్న ఎన్‌హెచ్ సిబ్బంది

- 35వ జాతీయ రహదారి భద్రతా దినోత్సవాలు

పెద్దశంకరంపేట(మెదక్): 161వ జాతీయ రహదారిపై జాగ్రత్తగా ప్రయాణం చేయాలని పోలీస్ హైవే పెట్రోలింగ్ సిబ్బంది, కేఎస్ఆర్ ప్రాజెక్ట్ హైవే సిబ్బంది అన్నారు. శనివారం 35వ జాతీయ రహదారి భద్రతా ఉత్సవాల్లో భాగంగా స్థానిక కోళపల్లి పాత టోల్‌ప్లాజా వద్ద ప్రయాణికులకు, డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. వాహనాలకు వెనుక వైపు రెడ్, ఎల్లో రేడియం స్టిక్కర్లు అంటించుకోవాలన్నారు. రహదారిపై అనవసరంగా వాహనాలు నిలపొద్దన్నారు. నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ హైవే పెట్రోలింగ్ ఏఎస్ఐ షరీఫ్, కృష్ణయ్య, ఐఎంఎస్ మేనేజర్ ఖాజామోయినుద్దీన్, పీఆర్ఓ శివకుమార్ తదితరులు ఉన్నారు.

ఉమ్మడి జిల్లా ప్రైవేట్ కాలేజీల కార్యవర్గం ఇదే



దుర్గేశ్వర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు



పృథ్వీరాజ్ గౌడ్, ఉపాధ్యక్షుడు

నర్సాపూర్ రూరల్: తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నర్సాపూర్ డీఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.దుర్గేశ్వర్‌రెడ్డిని, ఉపాధ్యక్షుడిగా నర్సాపూర్ వైష్ణవి కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పృథ్వీరాజ్ గౌడ్‌ను ఎన్నుకున్నారు. శనివారం మెదక్‌లోని సిద్ధార్థ పాఠశాలలో ఎలక్షన్ అధికారులు ప్రభాకర్ గౌడ్, మహిపాల్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా దుర్గేశ్వర్, రాజ్‌గౌడ్ మాట్లాడుతూ కళాశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

- ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మెకు పిలుపు
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం

మెదక్ కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం పిలుపునిచ్చారు. శనివారం మెదక్‌లోని సీఐటీయూ భవన్‌లో సంఘం జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చే వ్యతిరేకతను గ్రహించిన కేంద్రం వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కోసం మతరాజకీయాలకు తెరలేపుతోందని విమర్శించారు. అయోధ్య రాముడి అక్షింతల పేరుతో ప్రతి ఇంటికీ వెళ్తూ ప్రజలెదుర్కొంటున్న సమస్యలను పక్కదారి పట్టిస్తోందన్నారు. ఈ తరహా మత రాజకీయాలను తిప్పి కొట్టేందుకు కార్మిక వర్గం, రైతాంగం, ప్రజలందరినీ చైతన్యవంతం చేస్తున్నామని చెప్పారు. అన్ని జాతీయ కార్మిక సంఘాలు, కిసాన్ మోర్చా, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె–గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బస్వరాజు, జిల్లా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, కోశాధికారి నర్సమ్మ, జిల్లా నాయకులు కడారి నాగరాజు, బాలేష్, వెంకటరామిరెడ్డి, బాల నర్సు, పుష్ప, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నేడే మల్లన్న పట్నం వారం



కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. ఆదివారం.. పట్నం వారంతో జాతర మొదలై ఉగాదికి ముందు వచ్చే ఆదివారంతో ముగియనుంది. ఈఏడాది జాతర 12 వారాల పాటు కొనసాగనుంది. సోమవారం తోట బావి వద్ద హైదరాబాద్‌కు చెందిన భక్తులు నిర్వహించే పెద్ద పట్నం, అగ్ని గుండాలకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే జాతరకు వచ్చే భక్తుల వసతి కోసం చర్యలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలోకి వాహనాలు రాకుండా అధికారులు ఆంక్షలు విధించారు.

బస్సు మార్గాలు ఇవే..

హైదరాబాద్, మెదక్, సిద్దిపేట జనగామ, వరంగల్ నుంచి జాతరకు వచ్చే భక్తులకు బస్సు మార్గాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి కొమురవెల్లి ఆలయం 85 కిలోమీటర్లు, కరీంనగర్ నుంచి 65 కిలోమీటర్లు, వరంగల్ నుంచి 110 కిలోమీటర్లు ఉంటుంది. భక్తుల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను సిద్దిపేట, పికెట్, జనగామ, కరీంనగర్ డిపోలలో ఏర్పాటు చేశారు.

మహనీయులు ఆదర్శనీయులు

- ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్
- ఒక్కరోజు జిల్లాస్థాయి క్రీడా పోటీలు



కబడ్డీ ఆడుతున్న బాలికలు

మెదక్ కలెక్టరేట్: మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ విద్యార్థులకు సూచించారు. శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో స్థానిక బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఒక్క రోజు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వివేకానంద, సుభాష్ చంద్రబోస్‌ల జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించామన్నారు. తమ సంఘం ఒక వైపు విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడుతూనే మరోవైపు విద్యార్థుల్లో దాగి యున్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసే యత్నం చేస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు శశి కాంత్, రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఉదయ్, ప్రశాంత్ పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి జూనియర్ రగ్బీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రగ్బీ పోటీలకు 24 మంది ఎంపిక

చేగుంట(తూప్రాన్): రాష్ట్రస్థాయి జూనియర్ టచ్ రగ్బీ పోటీలకు జిల్లా నుంచి 24 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. శనివారం చేగుంట మోడల్ పాఠశాల ఆవరణలో అండర్ –14 బాలబాలికలకు జిల్లాస్థాయి పోటీలను నిర్వహించారు. ఇందులో 200 మంది పాల్గొన్నారు. ప్రతిభను కనబర్చిన రోహిత్, భరత్, మనోహర్, వంశీకృష్ణ, చరణ్, భాను, విజయ్, మణికంఠ, రాకేష్, బిట్టూ, చాణక్య, అభిచరణ్‌లు జిల్లా బాలుర జట్టుకు ఎంపికయ్యారు. గాయిత్రి, లాస్య, దివ్య, కావ్య, లక్ష్య, వర్షశ్రీ, షరీబా, నందిని, అఖిల, వైష్ణవి, వర్ష, రాణి, కుమారిలు బాలికల జట్టుకు ఎంపికయ్యారు. స్టాండ్‌బైగా సాయి, రిశ్వంత్, హర్షవర్ధన్, కార్తీక్, విశాల్, వైష్ణవి, సాహితి, లక్ష్మీప్రసన్న, అనురాధ ఎంపికయ్యారు. ఈనెల చివరివారంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరంతా పాల్గొంటారని కోచ్ కరణం గణేష్ రవికుమార్ తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ భూపాల్‌రెడ్డి, పీడీలు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రజతం

జాతీయ స్థాయి పోటీలకు ఇద్దరు గురుకుల విద్యార్థులు





జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన సంతోష్, రాహుల్



రజత పతకం సాధించిన మెదక్ జిల్లా జట్టు

నర్సాపూర్ రూరల్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఈనెల 16 నుంచి 19 వరకు 67వ అండర్– 14 రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు జరిగితే మెదక్ జిల్లా బాలుర జట్టు రజత పతకం సాధించింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. జిల్లా జట్టులో నర్సాపూర్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల సాఫ్ట్ బాల్ అకాడమీకి చెందిన 10 మంది ప్రాతినిధ్యం వహించారని ప్రిన్సిపాల్ భిక్షమయ్య గుర్తు చేశారు. కాగా ప్రతిభ కనబరిచిన నర్సాపూర్ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు సంతోష్, రాహుల్.. ఫిబ్రవరి 3 నుంచి 6వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కబీర్ధాంలో జరిగే 67వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే తెలంగాణ జట్టుకు ఎంపికయ్యారు. వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి, పీఈటీలు రాజు, సుజాత, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

క్లుప్తంగా

సమ్మెను విజయవంతం చేయండి

సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజయ్య



సమావేశంలో రాజయ్య, కార్యకర్తలు

జిన్నారం(పటాన్‌చెరు): కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ వచ్చే నెల 16న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజయ్య పిలుపునిచ్చారు. జిన్నారం మండలంలోని ఖాజీపల్లి పారిశ్రామిక వాడలో సీఐటీయూ క్లస్టర్ కార్యకర్తలతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్‌కు అండగా నిలుస్తుందన్నారు. మూడోసారి దేశంలో బీజేపీ అధికారంలోకి రావడం కోసం కేంద్రం అనేక జిమ్మిక్కులు చేస్తుందన్నారు. కేంద్రం అనుసరిస్తున్న వైఖరిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



భావనను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దుబ్బాకటౌన్ : జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో డిసెంబర్‌లో ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో దుబ్బాక మున్సిపాల్టీలోని ధర్మాజీపేట పాఠశాల విద్యార్థిని జి.భావన ప్రదర్శించిన ఎగ్జిబిట్ రాష్ట్రస్థాయికి ఎంపికైంది. సైన్స్ ఫెయిర్‌లో గణిత విభాగానికి చెందిన కంప్యూటర్ థింకింగ్‌లో త్రిగ్నోమెట్రిక్ పార్క్ మ్యాథమెటిక్స్ మోడల్ కంప్యూటేషనల్ థింకింగ్ సబ్ థీమ్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థి భావనతోపాటు గైడ్ టీచర్లుగా వ్యవహరించిన పద్మావతి, శ్రీనివాస్‌రెడ్డిలను శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

నిధుల్లేవ్.. నీళ్లూ లేవ్!

కాళేశ్వరం కాల్వల పనులకు గ్రహణం

- నత్తనడకన కొనసాగుతున్న పనులు
- ఆరేళ్లు అయినా పూర్తికాని భూసేకరణ
- ఇంకా సేకరించాల్సింది 1,429 ఎకరాలు
- నిధుల విడుదలే ప్రధాన సమస్య
- 93 వేల ఎకరాలకు అందని నీళ్లు

జిల్లాలో వేలాది ఎకరాలకు సాగు నీరు అందించే కాళేశ్వరం కాల్వల పనులకు గ్రహణం వీడడం లేదు. ప్రధాన మూడు ప్యాకేజీలకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ ఇప్పటి వరకు పూర్తి కాలేదు. దీని ఫలితంగా కాల్వల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. 2018లో ప్రారంభమైన పనులు ఆరేళ్లుగా అలాగే ఉన్నాయి. ఇందుకు నిధుల విడుదలే ప్రధాన సమస్యగా అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై అధికారులు తరచూ సమీక్షలు నిర్వహించడం తప్ప ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. గతేడాది సెప్టెంబర్ వరకే పనులు పూర్తి చేస్తామని లక్ష్యం పెట్టుకున్నా నెరవేరలేదు. - మెదక్



వెల్దుర్తి మండల శివారులో అసంపూర్తిగా ఉన్న కాల్వ

కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో 17,18,19 ప్యాకేజీలు ప్రధానమైనవి. ఈ మూడు ప్యాకేజీలు పూర్తి అయితే జిల్లాలోని 93 వేల ఎకరాల ఆయకట్టుకు సాగుకు నీరందుతుంది. మూడు ప్యాకేజీల ద్వారా వెల్దుర్తి, కొడిపల్లి, కొల్చారం, చిలప్‌చెడ్, టేక్మాల్, పాపన్నపేట, పెద్దశంకరంపేట, అల్లాదుర్గం మండలాల పరిధిలో సస్యశ్యామలం అవుతుంది. ఇందుకుగాను మొత్తం 4,791 ఎకరాల భూమి సేకరించాల్సిన అవసరం ఉంది. ఇప్పటి వరకు 3,362 ఎకరాల భూ సేకరణ జరిగింది. ఇంకా 1,429 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఇంకా భూసేకరణ 17వ ప్యాకేజీలో 22 ఎకరాలు, 18వ ప్యాకేజీలో 486 ఎకరాలు, 19వ, ప్యాకేజీలో 921 ఎకరాలు ఉంది. ఈ భూముల సేకరణకు రూ.330.38 కోట్లు నిధులు అవసరం అవుతాయని అధికారులు చెబుతున్నారు.

రూ.886.72 కోట్ల బకాయిలు..

కాళేశ్వరం పనులను 17, 18, 19 ప్యాకేజీలుగా విభజించారు. ఇందులో 17వ ప్యాకేజీ పనుల కోసం రూ. 986.18 కోట్లు, 18వ ప్యాకేజీకి రూ.758 కోట్లు, 19వ ప్యాకేజీకి రూ.762.42 కోట్లు వెచ్చిస్తున్నారు. ఈ మూడు ప్యాకేజీల నిర్మాణాలకు మొత్తం రూ.2,506.47 కోట్లు విడుదల కావాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.1,620 కోట్లు మాత్రమే విడుదలైనట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా రూ.886.72 కోట్లు విడుదల కావాల్సి ఉంది.

ప్యాకేజీల వారీగా భూమి వివరాలు..

కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్యాకేజీ 17లో 4.575 కిలోమీటర్ల దూరం మెయిన్ కెనాల్ , 18.62 కిలోమీటర్ల టన్నెల్ నిర్మించాలి. ప్యాకేజీ 18లో 36.305 కిలో మీటర్ల దూరం మెయిన్ కెనాల్ 3.948 కిలోమీటర్ల దూరం టన్నెల్ నిర్మించాలి. ప్యాకేజీ 19లో 12 కిలోమీటర్ల దూరం మెయిన్ కెనాల్, 75.2 కిలోమీటర్ల దూరం బ్రాంచ్ కెనాల్ నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

'నీరు'గారుతున్న లక్ష్యం

కాళేశ్వరం ప్రాజెక్ట్ కాల్వల పనులు 2018లో ప్రారంభమయ్యాయి. అప్పట్లో పాలకులు, అధికారులు మూడేళ్లలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. కానీ ఆరేళ్లు అవుతున్నా ఇంతవరకు పూర్తి కాలేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది. ఇవి పూర్తయితే వేలాది ఎకరాలకు నీరందుతుందని రైతులు ఎదురుచూస్తున్నారు. ఏళ్ల తరబడి నిధులు ఏకకాలంలో విడుదల కాకపోవడంతో జాప్యం జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిధులు విడుదల చేసి త్వరగా కాల్వల నిర్మాణం పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష



వర్గల్(గజ్వేల్): గజ్వేల్‌లోని ఓ హైస్కూల్‌లో పరీక్షను పరిశీలిస్తున్న ఆర్డీఓ బన్సీలాల్

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3,703 మంది హాజరు

జిల్లా	దరఖాస్తులు	హాజరు	గైర్హాజరు
సంగారెడ్డి	2,113	1,359	754
మెదక్	1,501	933	568
సిద్దిపేట	2,182	1,411	771



మిరుదొడ్డి(దుబ్బాక): పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2024–25 విద్యా సంవత్సరం ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణకు వివిధ ప్రాంతాల్లో 29 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 5,796 మంది విద్యార్థులకు గాను 3,703 మంది పరీక్షకు హాజరు కాగా 2,093 మంది గైర్హాజరైనట్లు వర్గల్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పరీక్ష ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రశాంతంగా కొనసాగిందన్నారు.



సదాశివపేట సెయింట్ మేరీస్ పీఎస్‌ఎమ్ హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



రామాయంపేట : పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

ఆలయ భూములను కాపాడాలి

- భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి
- సీపీఎం ఆధ్వర్యంలో మల్లన్న ఆలయ ఈవోకు వినతిపత్రం



ఆలయ ఈవో బాలాజీకి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): కబ్జాకు గురవుతున్న కొమురవెల్లి మల్లికార్జున స్వామి భూములను కాపాడాలని, జాతర సందర్భంగా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ఆలయ ఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఆలయానికి కేటాయించిన భూములు కబ్జాకు గురవుతున్నా పట్టించుకోలేదని, ఇప్పటికైనా స్వామి వారి భూములకు హద్దులు ఏర్పాటు చేసి ప్రహరీ నిర్మించాలన్నారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు సరిపడా టాయిలెట్లు, మంచి నీటి సౌకర్యం, పార్కింగ్ ప్రదేశాలు లేవని అన్నారు. 12వ తేదీన నిర్వహించిన పాలక సమావేశానికి జనగామ డీసీసీ అధ్యక్షుడు ఏ హోదాలో హాజరయ్యాడని ఈవో బాలాజీని ప్రశ్నించారు. సమావేశానికి అనుమతి ఇచ్చిన ఈవోపై దేవాదాయ శాఖ కమిషనర్‌కు త్వరలోనే ఫిర్యాదు చేస్తామని వినతిపత్రం అందజేసిన అనంతరం విలేకరులతో తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగా కృష్ణారెడ్డి, రాంసాగర్ సర్పంచ్ తాడూరి రవీందర్, మండల నాయకులు తేలు ఇస్తారి, బాలకిషన్, సాయిలు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

- చేర్యాలలో ఎనిమిది మంది, రాయికోడ్‌లో 12 మంది
- రూ.1.70 లక్షలు స్వాధీనం



చేర్యాల(సిద్దిపేట): ఎనిమిది మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ దామోదర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్టు నమ్మదగిన సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. ఇందులో 8 మందిని అదుపులోకి తీసుకోవడంతోపాటు వారి నుంచి రూ.1.70లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రాయికోడ్(అందోల్): మండలంలోని కుసునూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం సాయంత్రం గ్రామ సమీపంలోని వాగు ఒడ్డున ఓ చెట్టు కింద పేకాట ఆడుతుండగా సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. పేకాట ఆడుతున్న 12 మంది కుసునూర్ గ్రామస్తులను అరెస్ట్ చేశామన్నారు. వీరి వద్ద రూ.19,900 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

- పొలం పనులు చేస్తుండగా ఎత్తుకెళ్లిన దొంగ
- నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలింపు
- వివరాలను వెల్లడించిన ఏసీపీ సురేందర్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ సురేందర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): మహిళ మెడలోంచి పుస్తెల తాడును ఎత్తుకెళ్లిన దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. కొండపాక మండలంలోని దుద్దెడ మధిర సెలంపు గ్రామానికి చెందిన పాతర్ల మల్లవ్వ ఈనెల 18న సొంత పొలం వద్ద పనులు చేస్తుండగా షాహిద్ అనే వ్యక్తి వచ్చాడు. పక్కన వెంచర్‌లో ప్లాట్లు విక్రయిస్తున్నామంటూ ఆమెతో మాటమాట కలిపాడు. దాహానికి నీళ్లు అడగడంతో మల్లవ్వ ఇస్తుండగా మెడలో 3 తులాల పైచిలుకు పుస్తెల తాడును గమనించాడు. సాయంత్రం వరకు మహిళ పని చేస్తున్న ప్రదేశంలోనే అటూ ఇటూ తిరుగుతూ కాలక్షేపం చేశాడు. 5 గంటల ప్రాంతంలో మల్లవ్వకు దూరంగా కుటుంబీకులు పని చేస్తున్న విషయాన్ని గమనించి ఆమెను కిందపడేసి పుస్తెలతాడు ఎత్తుకెళ్లాడు. బాధితురాలు మల్లవ్వ ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. శనివారం త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్సాన్‌పల్లి శివారులో సీఐ భాను ప్రకాశ్‌తో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా నిందితుడు షాహిద్ అనుమానాస్పదంగా బైక్‌పై తిరుగుతూ కనిపించాడు. అతడిని పట్టుకొని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. పుస్తెల తాడును ఓ షాపులో కుదవపెట్టగా స్వాధీనం చేసుకొని షాహిద్‌ను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడు తొగుట మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామ వాసి అని పేర్కొన్నారు. కేసును తొందరగా ఛేదించిన సీఐ భాను ప్రకాశ్, ఐడీ పార్టీ కానిస్టేబుళ్లు ఎండీ అఫ్జల్, మంత్రి శ్రీనివాస్, ముత్తంగి స్వామి, సీసీ కెమెరా ఆపరేటర్లు పరంధాములు, జగన్‌ను ఏసీపీ సురేందర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

గురుకులాల భద్రత మన బాధ్యత

టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్



ఎన్నికైన నూతన కార్యవర్గం

సిద్దిపేటకమాన్: గురుకులాల భద్రత మన బాధ్యత అని, సామాజిక సమస్యలపై పోరాటం చేస్తామని తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. గురుకులాల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, నూతన భవనాల నిర్మాణం కోసం పని చేస్తున్న సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకులాల పేరెంట్స్ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పవన్‌కుమార్, నందం, లావణ్య, సత్యం, అనీల్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

జోగిపేట జూనియర్ సివిల్ జడ్జి ధనలక్ష్మి



మాట్లాడుతున్న ధనలక్ష్మి

జోగిపేట (అందోల్): సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జోగిపేట జూనియర్ సివిల్ జడ్జి ధనలక్ష్మి సూచించారు. శనివారం జోగిపేట బీసీ గురుకుల పాఠశాల బాలుర హాస్టల్‌ను తనిఖీ చేశారు. కిచెన్ రూమ్, డైనింగ్ హాల్‌ను పరిశీలించి విద్యార్థులకు న్యాయమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ఉన్న స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులతో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు.



సాధు(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన హవేళిఘణాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కు మ్మరి సాధు (28) ప్రైవేటు బస్సు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మధ్య కాలంలో ఇంటి నిర్మాణం చేపట్టగా, అప్పులు ఎక్కువయ్యాయి. ఆర్థిక ఇబ్బందులు తాళలేక శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య ఎల్లమ్మ, కుమార్తె ఉంది. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో దూకి..



కనకయ్య(ఫైల్)

గజ్వేల్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గజ్వేల్ పట్టణంలోని (పార్శికుంట) వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని రాజిరెడ్డిపల్లికి చెందిన పుల్ల కనకయ్య(40)కు భార్య కవిత, కొడుకు, కూతురు ఉన్నారు. కనకయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా ఎటువంటి పని చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన కనకయ్య శనివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయి సమీపంలోని పార్శికుంట(చెరువు)లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ భూమి కబ్జా చేస్తే..

- ప్రభుత్వ పథకాలు కట్
- త్వరలోనే ఫారెస్ట్‌ను గుర్తించి కందకాలు తీస్తాం
- రేంజ్ ఆఫీసర్ మనోజ్‌కుమార్



అవగాహన కల్పిస్తున్న అధికారులు

హవేళిఘణాపూర్(మెదక్): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎవరైనా అడవిని కబ్జా చేసేందుకు యత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలకు నిలిపివేస్తామని అటవీ రేంజ్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని గాజిరెడ్డిపల్లి గ్రామంలో అటవీ సంరక్షణ, అడవిని కాపాడడం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా అటవీ ప్రాంతంలోని భూమి కబ్జా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, అటవీ అధికారులతో జాయింట్ సర్వే చేసి కందకాలు తవ్వనున్నట్లు పేర్కొన్నారు. అడవులను సంరక్షించే బాధ్యత అందరిపై ఉందని, అందుకోసం ప్రతి ఒక్కరూ కాపాడాలన్నారు. ఎవరైనా ఫారెస్ట్ నిబంధనలు అతిక్రమించి వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీరామ్, డిప్యూటీ తహసీల్దార్, ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్, ఫారెస్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ దుకాణంలో రూ.7 లక్షలు చోరీ

- క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు
- తూప్రాన్‌లోని పోతరాజుపల్లి వద్ద ఘటన



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం బృందం

తూప్రాన్: సిమెంట్ దుకాణంలో భారీ నగదు చోరీ జరిగిన ఘటన తూప్రాన్ పట్టణ కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది.ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన మామిండ్ల శ్రీకాంత్ పట్టణంలోని పోతరాజుపల్లి గ్రామ సమీపంలో రహదారి పక్కన నటరాజ్ ఎంటర్ ప్రైజెస్ షాపు పెట్టి సిమెంట్, స్టీల్, సెంట్రింగ్ బాక్స్‌లను విక్రయిస్తున్నాడు. కొన్ని రోజులుగా జరిగిన వ్యాపారం డబ్బులను శుక్రవారం రాత్రి షాపు కౌంటర్‌లోనే దాచిపెట్టి తాళం వేసి ఇంటికెళ్లాడు. శనివారం ఉదయం దుకాణం తెరిచి చూడగా కౌంటర్‌లోని రూ.7.10 లక్షలు కనిపించలేదు. షాపు పైకప్పు పగిలిపోయి ఉంది. శ్రీకాంత్ వెంటనే పోలీసులు ఫిర్యాదు చేయడంతో సీఐ శ్రీధర్, ఎస్‌ఐ శివానందం ఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును గమనించి క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌ను రంపించారు. నిందితుల వేలిముద్రలు సేకరించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు.

కమీషన్లు, ఉద్యోగాల పేరుతో మోసం

రూ.3.85 లక్షలు పోగొట్టుకున్న బాధితులు



పటాన్‌చెరు టౌన్: సైబర్ వలలో పడి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి డబ్బులు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని సాయి అనురాగ్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ వాట్సాప్‌కు జనవరి 18వ తేదీన మెసేజ్ వచ్చింది. అందులోని లింక్ ఓపెన్ చేసి తన వివరాలను నమోదు చేశాడు. సైట్ నిర్వాహకులు అతడికి వ్యాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్క్‌లు చేశాడు. సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వ్యాలెట్‌లో నగదును, కమీషన్‌ను చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.2 లక్షలు 85 వేలు చెల్లించాడు. చివరిగా తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా నేరగాళ్లు స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి..

అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ జయలక్ష్మి నగర్‌కు చెందిన నిరుద్యోగి సాగర్‌కు అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్ గూడా కృషి డిఫెన్స్ కాలనీ చెందిన మట్టం విశ్వేశ్వర్ అలియాస్ విష్ణుతో పరిచయం ఏర్పడింది. ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో విష్ణుకు సాగర్ రూ.లక్ష చెల్లించాడు. ఉద్యోగం ఎప్పుడు ఇప్పిస్తావని అడుగడంతో సరిగా స్పందించలేదు. బాధితుడు అమీన్‌పూర్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మోసపోతున్న వారిలో మైనర్లే ఎక్కువ

జోగిపేట (అందోల్): ప్రేమ పేరుతో మోసపోతున్న వారిలో మైనర్లే ఎక్కువగా ఉన్నారని, ఆ కేసులే ఎక్కువ వస్తున్నాయని సంగారెడ్డి డీఎస్పీ రమేశ్ కుమార్ తెలిపారు. శనివారం జోగిపేటలోని పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. జోగిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసుల్లో పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే కేసులే ఎక్కువగా ఉన్నాయన్నారు. తల్లిదండ్రులకు, పిల్లలకు సరైన అవగాహన లేకపోవడంతోనే పోక్సో చట్టం కేసుల బారిన పడుతున్నారన్నారు. పోలీస్‌శాఖ తరపున ప్రతీ పాఠశాల, కళాశాలలో సదస్సులను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామన్నారు.